క్లుప్తంగా

పెద్దపల్లి ఎంపీకి సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే, గ్రంథాలయ చైర్మన్

జూలపల్లి: మండల కేంద్రంలో ఎంపీపీ రమాదేవి ఆహ్వానం మేరకు బంధువుల వివాహ వేడుకలకు హాజరైన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆహ్వానం మేరకు ఆయన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్ సన్మానించారు. బీఆర్‌ఎస్ మండల గౌరవాధ్యక్షుడు కంది చొక్కారెడ్డి, ధూళికట్ట సింగిల్‌విండో చైర్మన్ వేణుగోపాలరావు, జూలపల్లి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లోక రవీందర్‌రెడ్డి ఉన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పట్నాలు, బోనాలు



పూజల్లో పాల్గొన్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం చీకురాయి గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం పట్నాలు, బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, బీఆర్‌ఎస్ నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి బోనాలతో మొక్కులు సమర్పించారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్

జ్యోతినగర్: హన్మాన్ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామంలోని పురాతన హనుమాన్ ఆలయాన్ని గ్రామ పెద్దల సహకారంతో పునర్ నిర్మాణం చేపడుతున్నట్లు కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ తెలిపారు. అర్చకుడు సతీష్‌శర్మ గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆధుపినీకరణకు దాతలు సహకరించాలని కోరారు. గ్రామస్తులు సింగం మల్లికార్జున్‌గౌడ్, పూసాల శ్రీనివాస్, ఆడెపు శంకర్, ముసిపట్ల రాజు, రాజబాబుగౌడ్, సిద్దె వామన్ పాల్గొన్నారు.

'ఖని'లో చేపమందు పంపిణీ



చేప మందు వేస్తున్న కుమార్

గోదావరిఖనిటౌన్: మృగశిర కార్తె సందర్భంగా గురువారం స్థానిక ప్రధాన చౌరస్తాలో చేప మందు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పర్శరాములు తనయుడు కుమార్ మాట్లాడుతూ 40ఏళ్లుగా చేపమందు పంపిణీ చేస్తున్నామని, ఆస్తమా, దగ్గు, దమ్ము, జలుబు, జీర్ణ సంబంధిత తదితర వ్యాధులకు చేపమందు ఔషధంలా పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

సంకష్టహర చతుర్థి



పూజల్లో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం రాత్రి సంకష్టహర చతుర్థి నిర్వహించారు. గణపతి స్వామి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఅద్దెంకి సారంగచారి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి ఆశీర్వాద సువార్త సభలు

గోదావరిఖనిటౌన్: 9, 10, 11వ తేదీల్లో ఇంటర్ డినామినేషనల్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశీర్వాద సువార్త సభలు స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు సభల నిర్వహణ కమిటీ కన్వీనర్ పాస్టర్ జి.థామస్ తెలిపారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

- నియోజకవర్గంలో అందుబాటులో 7.13లక్షల మొక్కలు
- గతేడాది నాటిన మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం



ఎలిగేడు మండలం లాలపల్లి నర్సరీలో ఉన్న మొక్కలు

ఎలిగేడు: పల్లెలను పచ్చగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామానికి ఓ నర్సరీని ఏర్పాటు చేసి అందులో మొక్కలను పెంచే కార్యక్రమాన్ని చేపట్టింది. వర్షాలు పడితే పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇందుకు గాను నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు.

గ్రామానికో నర్సరీ..

పెద్దపల్లి నియోజకవర్గంలో 128 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం హరితహారం కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు కార్యదర్శులను భాగస్వాములను చేసింది. హరితహారంలో లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఎర్రమట్టి, పశువుల పేడ మిశ్రమాన్ని ఉపయోగించి మొక్కలు పెంచుతున్నారు. ఎండ తీవ్రత నుంచి మొక్కలను కాపాడేందుకు పచ్చని పందిళ్లు వేసి, మొక్కలను కాపాడుతున్నారు. అయితే ఈసారి జామ, సీతాఫల్, మునగ, చింత, బొప్పాయి, ఉసిరి, బాదం వంటి పండ్ల మొక్కలు పెంచుతున్నారు.

గత హరితహారంలో నాటిన మొక్కలు..

గత ఏడాది 2022–23కు గాను నియోజకవర్గంలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల మండలాల్లో 695 ప్రాంతాల్లో 7,34,770 మొక్కలు నాటగా వాటిని కాపాడేందుకు నీరు పోసేందుకు 376 మందిని నియమించారు. 7,00,924 మొక్కలు అంటే 95.39శాతం బతికి ఉన్నట్లు అధికారులు లెక్కలు చెప్తున్నప్పటికీ మొక్కలు ఎండిపోవడం, పశువులు నోటితో తొలగించడం వంటి కారణాలతో ఎక్కువశాతం మొక్కలు వివిధ కారణాలతో చనిపోయాయాని ప్రజలు అంటున్నారు. మొక్కల సంరక్షణ కోసం గ్రామాల్లో ట్రీ గార్డులు ఏర్పాటు చేయగా ప్రస్తుతం ఎక్కడా మొక్కలకు ట్రీగార్డులు కనిపించని పరిస్థితి ఉంది.

రోడ్డు వెడల్పుతో చెట్ల తొలగింపు..

ఎలిగేడు–ధూళికట్ట గ్రామాల మధ్యన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలు ప్రస్తుతం పెద్ద, పెద్ద చెట్లు కాగా వాటిని జేసీబీతో తొలగించారు. మొక్కలు నాటే ముందు డబుల్‌రోడ్డు నిర్మాణం దృష్టిలో పెట్టుకుని మొక్కలు నాటాల్సిందని, ఇప్పుడు వృక్షాలను తొలగించడం ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రత్యేక దృష్టిసారించాం



పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టింది. నర్సరీల్లో మొక్కలు పెంచే కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిసారించాం. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– మాడ కొండాల్‌రెడ్డి, సర్పంచ్, నారాయణపల్లి, ఎలిగేడు

సంరక్షణకు చర్యలు



హరితహారంలో నాటేందుకు అవసరమైన మొక్కలను సిద్ధం చేస్తున్నాం. నర్సరీల్లో పండ్లనిచ్చే, నీడనిచ్చే మొక్కలతోపాటు పూల మొక్కలు పెంచుతున్నాం. వర్షాలు పడగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. తర్వాత వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటాం.

– సదానందం, ఏపీవో, ఎలిగేడు

ట్రీగార్డులు లేవు



హరితహారంలో మొక్కలు నాటినప్పటికీ వాటిని కాపాడటంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మొక్కలకు ట్రీగార్డులు ఎక్కడా కనిపించడంలేదు. మొక్కలను సంరక్షిస్తే పర్యావరణ కాలుష్యాన్ని నిర్మూలించవచ్చు. చెట్లు పెంచు ఆరోగ్యాన్ని పంచు అనే నినాదంతో ముందుకు సాగాలి.

– రవియాదవ్, సామాజిక కార్యకర్త, ధూళికట్ట

ఊరూరా చెరువుల పండుగ సంబరాలు



సుల్తానాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ధర్మారం: బతుకమ్మలతో ఎంపీపీ, జెడ్పీటీసీ



కమాన్‌పూర్‌లో బతుకమ్మలతో మహిళలు



పెద్దపల్లిరూరల్: భోజన్నపేటలో..



కోలాటం ఆడుతున్న పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి



జూలపల్లి: అబ్బాపూర్‌లో..



ఎలిగేడు: ధూళికట్టలో..



జ్యోతినగర్: మేడిపల్లి పెరకవాని కుంట వద్ద



యైటింక్లయిన్‌కాలనీ: వేడుకల్లో మహిళలు



ఓదెల: కొలనూర్‌లో బతుకమ్మతో మహిళలు



కాల్వశ్రీరాంపూర్‌లో..

- బోనాలు, బతుకమ్మ ఆటలతో కోలాహలం
- సహపంక్తి భోజనాలు

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా ఊరూరా చెరువుల పండుగ వైభవోపేతంగా సాగింది. చిన్నారులు, యువతులు వేసిన కోలాటాలతో ఊళ్లలో కోలాహలం నెలకొంది. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి చెరువుల వద్దకు చేరుకున్నారు. కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని, బతుకమ్మలు చేత పట్టుకుని ర్యాలీగా చెరువులు, కుంటల వద్దకు వెళ్లి చెరువుల పండుగ నిర్వహించారు. అనంతరం సంహపక్తి భోజనాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రామగుండం: బతుకమ్మతో చెరువుకు వెళ్తున్న మహిళలు

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాలలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి గురువారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు భూమిపూజ చేశారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఖాదర్‌పాషాతో పాటు గ్రామ ప్రజాప్రతినిధులు, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వచర్ల గ్రామంలో..

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాకి గురువారం సర్పంచ్ గంట పద్మ భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సర్పంచ్ అన్నారు. ఉపసర్పంచ్ వేము కనుకయ్య, ఎంపీటీసీ కొట్టె సందీప్, పీఏసీఎస్ డైరెక్టర్ సైండ్ల సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి..

కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి గురువారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి భూమిపూజ చేశారు. సర్పంచ్ ఆకుల ఓదెలు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేక పూజల్లో గౌడ సంఘం నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపనను గురువారం ఘనంగా నిర్వహించారు. అలాగే 11న పోచమ్మ బోనాలు, 13న ఎల్లమ్మ బోనాలు, 14న ఎల్లమ్మ పట్నాలు, కల్యాణం నిర్వహించనున్నట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే మంచిరామి గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ధ్వజస్తంభం పునరుద్ధరణ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల బడిబాట



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



బడిబాటలో టీచర్లు

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లో బోధిస్తున్న విద్యపై ఉపాధ్యాయులు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జూలపల్లిలో బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వాడవాడలా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి, నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిద్రండులకు వివరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పిట్టల లచ్చయ్య, ప్రధానోపాధ్యాయులు సరస్వతి, లచ్చయ్య, గీతారాణి, రమాదేవి, వీరమల్లు, శ్రీనివాస్, పీడీ సురేశ్ పాల్గొన్నారు.

జనగామలో..

గోదావరిఖనిటౌన్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం స్థానిక జనగామ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు 3వ తేదీ నుంచి విస్తృత ప్రచారం చేపట్టారు. వివిధ కాలనీల్లో ఇంటింటా తిరుగుతూ గవర్నమెంట్ స్కూల్‌లో చేరితే కలిగే ప్రయోజనాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు తూటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్, శ్రీనివాస్, రమ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వారసంత టార్గెట్‌గా వరుస చోరీలు

- కొరవడిన నిఘా..
- ఆందోళనలో వినియోగదారులు



రోడ్డుపై వారసంత (ఫైల్)

ధర్మారం: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతలో వరస చోరీలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సంఘటనలతో వారసంతకు రావడానికి వినియోగదారులు జంకుతున్నారు. దొంగలు వారసంతను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నప్పటికీ అరికట్టడంతో పోలీసులు విఫలమవుతున్నారని స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా మంగళవారం వారసంతలో కూరగాయలు కొనడానికి వచ్చిన ముగ్గురి ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఆరునెలలుగా ప్రతి మంగళవారం జరిగే వారసంతలో 5 నుంచి 10 ఫోన్లు చోరీకి గురవుతున్నాయని వినియోగదారులు చెప్తున్నారు. దొంగతనం జరుగుతున్న తీరుపై పోలీసులు దృష్టి సారిస్తున్నప్పటికీ ఫలితం లేదు. పోలీసులు తూతూ మంత్రంగా రెండు, మూడు రౌండ్లు వేసి మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే రొటీన్ ఫిర్యాదుగా పోలీసులు భావిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ధర్మారం గ్రామానికి చెందిన బొల్లి రాజశేఖర్‌కు చెందిన రూ.18వేల విలువైన ఫోన్ వారసంతలో దొంగలు ఎత్తుకెళ్లగా పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఆధార్‌కార్డుతో పాటు ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌తో మీసేవలో ఫిర్యాదు చేస్తే ఇప్పిస్తామని చెప్పి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఫోన్ ఆచూకీ కనిపెట్టలేదని రాజశేఖర్ చెప్తున్నాడు. వారసంతలో వరుస చోరీలు జరుగుతుండటంతో వ్యాపారులు, వినియోగదారులు భయాందోళనకు గరవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు వారసంతలో జరిగే చోరీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

'విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి'



సుల్తానాబాద్‌లో మూసి ఉన్న ఎంఈవో కార్యాలయం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండల విద్యాధికారి కార్యాలయంలో సిబ్బంది మధ్యాహ్నం ఒంటిగంట వరకు విధులకు హాజరు కాకపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అజయ్ ఆరోపించారు. పలువురు విద్యార్థులు గురువారం కార్యాలయం వద్దకు వెళ్లగా సిబ్బంది లేరని తనకు సమాచారం అందించారని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బాయమ్మపల్లెలో గ్రామదేవతల ఉత్సవాలు

ఓదెల: మండలంలోని బాయమ్మపల్లెలో గ్రామదేవతల ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరిగాయి. సర్పంచ్ తొల్సూరి కొమురయ్య, రైతు సమన్వయ సమితి మండల చైర్మన్ కావటి రాజు, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణరావు, గుజ్జుల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

10న బీసీకులాల అవగాహన సదస్సు

గోదావరిఖని: 10న స్థానిక తిలక్‌నగర్‌లోని విశ్వం ఫంక్షన్‌హాల్‌లో సాయంత్రం 3గంటలకు బీసీ కులాల అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు మంథని రఘువీర్‌ప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం మాట్లాడారు. సమావేశానికి 15 బీసీ కుల సంఘాలు హాజరు కావాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

పెద్దపల్లిరూరల్: ఎరువులు, విత్తనాలను విక్రయించే డీలర్లు నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి అలివేణి అన్నారు. పెద్దపల్లిలో గురువారం పలు దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నిషేధిత పురుగుమందులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

రామగుండం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రయివేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో కె.సాహిత్య (ఇంటర్), జి.కీర్తి (10వ గురుకుల) విజేతలుగా నిలిచారు. పట్టణంలోని క్రియేటివ్ ట్యూటోరియల్స్ ప్రాంగణంలో గురువారం విజేతలకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పీటీడబ్ల్యూఏ జిల్లా ప్రతినిధులు కేఎస్.నందు, కస్నూరి లక్ష్మణ్‌రావు ఉన్నారు.

అనుమతి లేని స్కూళ్లను సీజ్ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధి

రామగుండం: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రయివేట్ పాఠశాలలను తనిఖీ చేయాలని, అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయించాలని కోరారు. ఈ మేరకు గురువారం పీడీఎస్‌యూ నాయకుడు ఈర్ల రామచంద్ర గురువారం రామగుండం మండల విద్యాధికారి పి.సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పారిశ్రామిక ప్రాంతంలో పలు ప్రయివేటు పాఠశాలల నిర్వాహకులు ఎలాంటి అర్హత లేని వారితో విద్యాబోధన చేయిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై ఎంఈవో సానుకూలంగా స్పందించారన్నారు.